# పుణ్యపురుషుడు

–కందుకూరి వెంకట మహాలక్ష్మి

చేతన్‌కి ఉదయం ఓ గంట షికారుగా నడవడం అలవాటు. రోజూలాగే ఆరోజూ షికారు వెళ్ళి వస్తుండగా ఇంటి సమీపానికి రాగానే ఎదురుగా వున్న కుప్పతొట్టెలో ఓ చంటిబిడ్డ ఏడుపు వినపడింది. 'ఎవరిదా ఏడుపు?' అనుకుంటూ, ఆతృత, ఆశ్చర్యాలతో ఆ కుప్పతొట్టె దగ్గరకి వెల్ళాడు. అప్పుడే పుట్టినట్లున్న ఓ చంటి పిల్లాడు వున్నాడా కుప్పతొట్టిలో. బొడ్డయినా కొయ్యలేదు. చూడటానికి పచ్చగా ఎంతో ముద్దుగా వున్నాడు. సరిగ్గా కళ్లయినా తెరవలేదు. ఎవరో పెద్దింటి పిల్లవాడి లాగున్నాడు. ఆ పిల్లాడినలా చూస్తూ వుండిపోయాడు చేతన్. ఏం చెయ్యాలో తోచటంలేదు. చుట్టూ చూసాడు. ఇంకా చీకట్లు పూర్తిగా వీడలేదు. చుట్టుపక్కల జనసంచారం లేదు. ఆ పిల్లాడిని అలాగే వదిలేద్దామంటే ఏ కుక్కలో పీక్కుతింటాయేమో! అనిపించింది. వెంటనే వెళ్లి రెండు చేతుల్తో ఆ పిల్లాడిని తీసుకున్నాడు. ఆ కాలనీలో పక్క వీధిలో వున్న ఆస్పత్రికి తీసుకెళ్ళాడు. అక్కడున్న డాక్టర్‌కి బిడ్డనిచ్చి కర్తవ్యాన్ని సూచించాడు. డాక్టర్ పిల్లాడి బొడ్డుకోసి ఓ బట్ట చుట్టి చేతన్‌కి అప్పగించింది. ఆ బిడ్డని తీసుకున్న చేతన్‌కి 'ఏం చెయ్యనీ బిడ్డని?' అన్న ఆలోచన వచ్చింది. ఏం తోచడంలేదు. ఇంటికి తీసుకొచ్చాడు. ఇంట్లో వున్న గ్లూకోజు కొద్దిగా నీళ్ళల్లో కలిపి ఏడుస్తున్న చంటిబాబుకి చెంచాతో నోట్లో పోసాడు.

"ఏ పాపిష్టి తల్లి కని యింత నిర్దయగా కుప్పతొట్టిలో పడేసిందో! ఆ కన్నదానికి బిడ్డని చూసయినా జాలి కలగలేదా? ఛీఛీ యింత నీచమైన పని చేసేముందు ఆలోచించుకోరా? అయినా ఒక్క తల్లినే అనడం ఎందుకు? ఆ పిల్లాడి తండ్రిది మాత్రం తప్పు కాదా? ఓ ఆడదానితో ఆటలాడుకున్నప్పుడు ఆలోచించుకోడా? వెధవపని చేసి తనకేం పట్టనట్లు ఆ స్త్రీని వదిలేసి వెళ్ళిపోతాడు. తప్పు ఒక్క ఆడదానిదేనా? కానీ లోకం నిందలన్నీ ఆడదానిమీదే వేస్తుంది. మగవాడినేం అనదు. తప్పు చేసింది యిద్దరూ అయినా నిందలపాలయ్యేది ఒక్క స్త్రీనే కదా" అని ఆలోచిస్తూ మళ్లీ కర్తవ్యం ఏమిటన్నట్లు పిల్లాడి వైపు చూశాడు. కడుపు నిండిన చంటిబిడ్డ హాయిగా నిద్రపోతున్నాడు. నడుం క్రింద తన లుంగీ వుంది. తువ్వాలు కప్పేడు. ఈ పిల్లాడిని ఏం చెయ్యాలి? నేనా బ్రహ్మచారిని. పెళ్ళయివుంటే ఈ బిడ్డని పెంచమని భార్యని అడిగేవాడు.

ఇంతలో తలుపు చప్పుడయింది. వెళ్ళి తీసాడు. ఎదురుగా ప్రాణమిత్రుడు సుధీర్. అతణ్ణి చూడగానే ప్రాణం లేచొచ్చింది. "రారా సుధీర్! నాకో చిక్కొచ్చింది" అంటూ జరిగిన కథనంతా చెప్పాడు. అన్నీ విన్న సుధీర్ "ఏమిటిరా! ఆ పిల్లాడిని యింటికి తీసుకొచ్చావేమిటి? ఏ అనాథ శరణాలయానికో అప్పచెప్పక" అంటున్న అతడిని చూస్తూ, చేతన్ "అది కాదురా ఆ పిల్లాడిని చూస్తుంటే ఏమిటో ఆత్మీయత అలుముకుంటోందిరా! ఎన్ని గంటల బిడ్డో! నేనా పెంచలేను. నువ్వన్నట్లు అనాథ శరణాలయంలో ఇచ్చేస్తే సరిగ్గా పెంచుతారంటావా?" అంటున్న చేతన్‌ని చూస్తూ "అయితే నువ్వా పిల్లాడిని పెంచగలవా? పెంచడమంటే మాటలా? ముందు, ముందు ఎన్ని సమస్యలొస్తాయో ఆలోచించావా?" అంటున్న సుధీర్ మాటలు నిజమే అనిపించాయి. అతడిని అడిగి దగ్గరలోనే వున్న శరణాలయానికి తీసుకెళ్ళి పిల్లాడిని అప్పగించి, లాంఛనాలన్నీ పూర్తిచేసి వస్తోంటే చేతన్ కళ్ళంట నీళ్ళు తిరిగాయి. అక్కడి మేనేజర్‌తో "ఈ బిడ్డకయ్యే ఖర్చు నేను భర్తిస్తాను. కాస్త జాగ్రత్తగా పెంచమని చెప్పి మరీ వచ్చాడు.

మేనేజర్ 'అలాగే సార్' అని లోపలి ఆయాని పిల్చి ఆ పిల్లాడిని అప్పగించాడు.

మర్నాడు వుండబట్టలేక మళ్ళీ ఆ శరణాలయానికి వెళ్ళి ఆ పిల్లాడిని చూసివచ్చాడు. ఎంతో హాయిగా నిద్రపోతున్నాడు. మేనేజర్ దగ్గరకి వెళ్ళి "ఈ పిల్లాడి పాల విషయం ఏం చేశా"రని అడిగాడు.

"సార్! ఎవ్వరికీ చెప్పం కానీ మీకు చెప్తున్నాం. పిల్లలు పోయిన కొందరు తల్లుల్ని తీసుకొచ్చి ఇలాంటి బిడ్డలకి పాలిప్పిస్తాం. ఆ తల్లులు బీదవాళ్ళయితే డబ్బిలిస్తాం. అదీకాక కొందరు మోసపోయిన స్త్రీలు బిడ్డల్ని కని అనాథ శరణాలయాలకి ఇచ్చేసి వెళ్ళిపోతారు. అలాంటి తల్లుల చేత కూడా పాలు యిప్పిస్తాం. మీరు ఈ పిల్లాడి బాధ్యత తీసుకుంటామన్నారు గనక చెప్తున్నాం. ఓ మోసపోయిన తల్లిట, ఆమెచేత ఈ పిల్లాడికి పాలు యిప్పిస్తున్నాం" అని చెప్పగానే కాస్త తృప్తిగానే యింటికి వచ్చేశాడు.

అలా పడుకుని ఆలోచిస్తున్న చేతన్‌కి అకస్మాత్తుగా ఆలోచనలు కాలేజీ రోజులవైపుకి పరిగెత్తాయి.

ఆరోజు కాలేజీలో చేతన్, మరికొందరూ కలిసి సరదాగా టూర్‌కి బయలుదేరారు. అది కాలేజి వాళ్లు ఎరేంజ్ చేసిన టూర్ కాదు. నాలుగు రోజులు శలవలు వచ్చాయి. ఓ అయిదు మంది స్టూడెంట్లు కలిసి బయలుదేరారు. అందులో ఓ యిద్దరమ్మాయిలు కూడా వున్నారు. చదువు పూర్తయి ఎవరిళ్ళకి వాళ్ళు వెళ్ళిపోయే ముందు సరదాగా వేసుకున్న టూర్ యిది. వెళ్ళిన మర్నాడే అందులో సునీత తండ్రికి సీరియస్ అయి ఆస్పత్రిలో చేర్పించారని ఫోన్ రాగానే సునీత కంగారుపడుతూ ఏడుస్తూ కూర్చుంది. చేతన్– ఆమెకి ధైర్యం చెప్పి ఆమెని తండ్రి దగ్గరకి తీసుకెళ్తానని ప్లేన్ మీద సునీతని దింపడానికి వెళ్ళాడు. మరో నాలుగు రోజులకి మిగిలిన స్నేహితులంతా తిరిగి వచ్చారు. మర్నాడు వారితో టూర్‌కి వెళ్ళిన కాదంబరి చేతన్ దగ్గరకొచ్చి కళ్ళనీళ్ళెట్టుకుంది. ఏమీ అర్థంకాని చేతన్ "ఏమయింది కాదంబరీ!" అని అడగ్గానే "మీరు సునీతని తీసుకెళ్ళిన మర్నాడు అరవింద్, అలోక్‌లు కలిసి నన్ను రేప్‌చేశా"రని గోలగోల పెడుతూ చెప్పింది. ఆ మాటలు విన్న చేతన్ స్థాణువులా నిలబడిపోయాడు. వెంటనే ఒక్క నిమిషం అని చెప్పి వెళ్ళి వాళ్ళిద్దర్నీ నిలదీశాడు. కాదంబరి అన్నీ అబద్ధాలు చెప్తోందనీ, అలాంటిదేం చెయ్యలేదనీ, రుజువేమిటనీ అడిగారు. ఏం చెయ్యగలడు, ఏం అనగలడు? కాదంబరి పట్ల జాలి ప్రదర్శించడం తప్ప– తిరిగొచ్చి కాదంబరికి ఈ విషయం చెప్పగానే "చేతన్! నేను ప్రెగ్నెంట్‌నయితే తలెత్తుకు తిరగ్గలనా? ఒక్కసారి ఆలోచించు. అసలే బీదవాళ్ళం. నాకు ఏ గర్భమయినా వస్తే చావే శరణ్యం చేతన్!" అని గోలపెట్టింది.

ఆమె బాధ చూస్తుంటే ఆ దుర్మార్గుల్ని చంపాలన్నంత కోపం వచ్చింది. కానీ ఏం చెయ్యలేని అసహాయత. పోనీ కాదంబరిని తను పెళ్ళిచేసుకుంటే!? అన్న ఆలోచన ఒక్క క్షణం రాగానే తల్లితండ్రుల గురించి ఆలోచించాడు. వాళ్ళు ఒప్పుకుంటారా? అన్న ఆలోచన వచ్చి, తనింకా చదువు పూర్తికాకుండా వున్న వ్యక్తి. స్వతంత్రంగా నిర్ణయం తీసుకోలేనివాడు. ఏం చెయ్యలేని నిస్సత్తువతో గదిలోకొచ్చాడు.

కొన్నాళ్ళకి చదువయి కాదంబరి యింటికి వెళ్ళిపోయింది. మెల్లిమెల్లిగా తనూ ఆ విషయం మర్చిపోయాడు.

చేతన్ చదువయిపోగానే తండ్రి తనని పై చదువుకి అమెరికా పంపాడు. చదువయి తిరిగొచ్చిన చేతన్‌కి తెలిసిందేమిటంటే కాదంబరి ఆత్మహత్య చేసుకుందని– ఆ రోజల్లా చేతన్ మనసు పాడయిపోయి పిచ్చివాడిలా తిరిగాడు. తనకొచ్చిన ఆలోచన ఆచరించి వుంటే! తను

## శైశవగీతి

ర్షాకాలపు వెన్నెల రాత్రి
నగరం మత్తుగా నిద్రిస్తున్న వేళ
మనుషుల మనస్సులాంటి ఇరుకైన వీధిలో
ఊరకుక్కలు శృంగారం జరుపుతున్న చోట
ఇద్దరి మానవ మృగాల శృంగార ఫలితం
నాగరికుల అనారికతకు ముసిరిన ఓ చీకటి సాక్ష్యం
విసిరివేయబడ్డ ఈ పసిదేహం...!

పొత్తిళ్ళలో ఒదిగి పెరగాల్సిన బాల్యం
చెత్తకుప్పలో ఒరిగి, తరిగి, కరిగిపోతోంది
చనుబాలకై చలిలో ఆకలితో రోదిస్తూ...
చలిచీమల ఆకలికై తన దేహాన్ని త్యజిస్తోంది
బాలకర్ణుని చెక్కపెట్టెలో పెట్టి వదిలించుకుంది ఆ కుంతి
పసికందుని చెత్తబుట్టలో వేసి విదిలించుకుంది ఓ ఇంతి

నిన్ను కన్నతండ్రికి చూపించాల్సిన కన్నతల్లో...
కన్నతల్లిలా చూసుకోవాల్సిన కన్నతండ్రో... పారేస్తే
రాబందులు సైతం జాలిపడ్డాయి...!
ఈ జననాన్ని ప్రశ్నించలేని మనం
ఖననానికి మాత్రం చూపిస్తున్నాం... శ్మశానం.

–అనిల్ కుమార్ సోమయాజుల

ధైర్యం చేసి కాదంబరిని వివాహం చేసుకుని వుంటే! ఆమె జీవితం మరోలాగుండేదేమో! అన్న ఆలోచనే బుర్రని తొలచసాగింది. అప్పుడు తల్లిదండ్రులకి భయపడి ఒక జీవితాన్ని బలితీసుకున్నాను. అది అతన్ని చాలా బాధించసాగింది.

తల్లీ తండ్రీ ఉద్యోగం రాగానే చేతన్‌కి పెళ్లి చెయ్యాలని నిశ్చయించారు. చేతన్‌కి యిప్పట్లో పెళ్ళి చేసుకోవాలని లేదు. ప్రతీ క్షణం కాదంబరే గుర్తు కొస్తోంది. కొన్నాళ్ళాగమని తల్లిదండ్రులకి చెప్పాడు.

ఇంతలో జరిగిన సంఘటన యిది. ఇప్పుడతని దృష్టంతా కుప్పతొట్టిలో దొరికిన పిల్లాడి మీదే వుంది. తనని పెళ్ళి చేసుకునే భార్య ఆ పిల్లాడిని తెచ్చి పెంచు కుందామంటే ఒప్పుకుంటుందా? పెంచినా తనకి పిల్లలు పుడితే ఆ పిల్లాడిని జాగ్రత్తగా చూస్తుందా? అన్న ఆలోచనతో సతమతమవుతున్నాడు.

ఓ రోజు శరణాలయానికి వెళ్ళి మేనేజర్ దగ్గర కూర్చుని అతన్ని కొన్ని విషయాలడిగాడు. చేతన్‌ని కాస్సేపక్కడే కూర్చోమని చెప్పాడు. కొంతసేపటికి ఓ స్త్రీ వచ్చింది. మేనేజర్ ఆమెని చూపించి "ఈవిడే ఆ మోసపోయిన స్త్రీ. పేరు మాధవి. మీరు యిచ్చిన బిడ్డకి తల్లిలా పాలు యిస్తోంది" అని చెప్పగానే ఆమెని తేరపార చూసాడు. ఆమె వెళ్ళిన కాస్సేపటికి తనూ బయలుదేరి వెళ్ళాడు. ఆమె ఓ యింటి వద్ద ఆగి లోపలికి వెళ్ళిపోయింది.

ఇంటికెళ్ళిన చేతన్‌కి ఫోన్ వచ్చింది. తల్లి సీరియస్ అని వెంటనే రమ్మని తండ్రి చెప్పాడు. సెలవుపెట్టి వెళ్ళిన మర్నాడే తల్లి స్వర్గస్తురాలయింది. దిన వారాలయ్యాక తిరిగొచ్చాడు. వచ్చేముందు తండ్రి "ఒరేయ్! మీ అమ్మ నీ పెళ్ళి చూడాలనుకుంది, చూడకుండానే వెళ్ళి పోయింది. ఇప్పుడయినా పెళ్ళి చేసుకోరా" అని చెప్పాడు.

"నాకు కొన్ని అభిప్రాయాలున్నాయి. అవి తీరాలి. అలాంటి అమ్మాయి దొరికినప్పుడు చేసుకుంటాను" అని తిరిగొచ్చాడు.

వచ్చిన మర్నాడే శరణాలయానికెళ్ళి పిల్లాడిని చూసి వచ్చాడు. మూడో నెల వచ్చింది. చక్కగా బొద్దుగా వున్నాడు. తనుండగానే మాధవి వచ్చి పాలిచ్చి వెళ్ళింది.

ఆమె వెళ్లిన కాస్సేపటికి తనూ లేచి ఆమె వెంట వెళ్లాడు. "మాధవిగారూ!" అని పిలవగానే ఆమె వెనక్కి తిరిగి ఆశ్చర్యపోయింది. "ఎవరు మీరు?" అంది. అందుకు జవాబుగా "మీతో మాట్లాడాలి. ఒక్కసారి పార్కులోకి వస్తారా?" అన్నాడు. "ఎందుకు?" అంటూ ప్రశ్నార్థకంగా ముఖం పెట్టింది. "ఒక్క పది నిముషాలు" అంటూ పార్కువైపుకి నడిచాడు. మాధవి కూడా వెంట నడిచింది.

పార్కులో ఓ బెంచీ మీద కూర్చున్నారిద్దరూ. చేతన్ ఆమెనే చూస్తూ "మాధవిగారూ, మీరు రోజూ తల్లిలా ఆదుకుంటున్న ఆ పిల్లాడి గురించి తెలుసా?" అని అడగ్గానే, కాస్త కంగారుగా, తెల్లబోతూ "తెలీదు. అయినా యిప్పుడా విషయాలెందుకు? మీకేం పని?" అంది. "ఉంది గనకనే అడుగుతున్నాను" అంటూ ఆ పిల్లాడి గురించిన విషయాలు చెప్పాడు.

మౌనంగా తలదించుకుని అన్నీ వింది. కాస్సేపటికి "మీ గురించిన వివరాలు చెప్తారా?" అన్నాడు.

"మీకెందుకు నా వివరాలు? ప్రస్తుతం నేను అనారోగ్యవంతురాలయిన ఓ పెద్దావిడకి నర్సుగా వుండి చూసుకుంటున్నాను- అంతే" అంది.

"మీరు చెప్పకపోయినా కొంత నాకు మీ గురించి తెలిసింది. మీరు మోసపోయిన స్త్రీ అనీ- దాని గురించి ఏమన్నా చెప్తారా?" అని అడగ్గానే ఆమెకి దుఃఖం కట్టలు తెంచుకొచ్చి, కన్నీటిని ఆపుకోడానికి కొంగు అడ్డు పెట్టుకుంది.

"మాధవిగారూ మీకు న్యాయం చెయ్యడానికే నేనీ ప్రశ్న వేశాను. నన్ను నమ్మండి" అని అనగానే, తనని మోసం చేసిన వారి గురించిన వివరాలు చెప్పి, తనకి పుట్టిన బిడ్డని తల్లి ఎవరికో పెంపకానికి యిచ్చేసిందనీ, తనీ పిల్లాడికి పాలిచ్చి వాడిలోనే తన బిడ్డని చూసు కుంటున్నాననీ చెప్పింది. చేతన్ షాకయి అలా కూర్చుండిపోయాడు. కాస్సేపటికి తేరుకుని "నేను మిమ్మల్ని వివాహం చేసుకుని, ఆ పిల్లాడిని దత్తత తీసుకుంటాను. ఆ పిల్లాడికి తల్లయి పెంచుతారా? మీకేమన్నా అభ్యంతరమా?" అని అడగ్గానే చిత్రంగా చేతన్ వైపు చూస్తూ వుండిపోయింది.

"మరో విషయం, మనకి పిల్లలు పుడితే సరిగ్గా చూడలేమేమో అన్న సందేహం వద్దు. నేను పిల్లలు పుట్టకుండా ఆపరేషన్ చేయించుకుంటాను" అన్నాడు. మాధవి మౌనాన్ని అంగీకారంగా తీసుకున్నాడు.

చేతన్, మాధవిలు సింపుల్‌గా పెళ్ళి చేసుకున్నారు. మరికొన్నాళ్ళకి శరణాలయానికెళ్లి లాంఛనాలన్నీ పూర్తిచేసి ఆ పిల్లాడిని దత్తత చేసుకున్నారు.

ఈ సందర్భంగా స్నేహితులందర్నీ పిలిచి చిన్న పార్టీ ఏర్పాటు చేశారు చేతన్, మాధవిలు. పార్టీకి వచ్చిన వారంతా వారి ఆదర్శాలని పొగుడుతూ అభినందించారు. ఆ పార్టీకొచ్చిన చేతన్ క్లాస్‌మేట్లు అరవింద్, అలోక్‌లు ఈ జంటను చూసి కంగారు పడ్డారు. వాళ్ళకిద్దామని తెచ్చిన గిఫ్టుని అలాగే చేతిలో పట్టుకుని నిలబడిపోయి, చేతన్, మాధవిలను అభినందించలేక పోయారు. ఇది కనిపెట్టిన చేతన్- వారి దగ్గరకొచ్చి, మాధవిని వాళ్ళకి పరిచయం చేస్తూ "ఒరేయ్! ఈమెనే నేను వివాహం చేసుకున్నాను. మీకూ ఈమె పరిచయమే అనుకుంటాను"

"కాదంబరిని మోసంచేసిన దుర్మార్గులే ఈమెనీ మోసం చేశారట. అందరు స్త్రీలు కాదంబరిలాగ మోసపోగానే ఆత్మహత్య చేసుకోలేరు. అలాంటిదే ఈ మాధవీనూ. కొందరలా అయితే మరికొందరు మోస పోయిన స్త్రీలు బిడ్డల్ని కని ఏ చెత్తకుండీలోనో పారేసి వెళ్ళిపోతారు. అలా నాకు దొరికిన ఓ అనాథ బిడ్డకి తండ్రినవ్వాలని, ఓ మోసపోయిన స్త్రీకి భర్తనవ్వాలని నిశ్చయించుకున్న నిర్ణయమే మా ఈ వివాహం, ఆ పిల్లాడి దత్తత. ఆలస్యంగానయినా కన్ను తెరుచు కున్నాననుకుంటున్నాను. కాదంబరి మోసపోయి నా దగ్గరకొచ్చి ఏడ్చినప్పుడే నేనిలాంటి ఆలోచన చేసివుంటే ఆమె జీవితాన్ని కాపాడుకునే వాడిని. దేశంలో అందరు అనాథల్నీ సంస్కరించలేను. కనీసం ఒక్కరికన్నా న్యాయం చేశాననిపిస్తోంది. కనీసం ఓ మంచి పని చేశానన్న తృప్తి నాకు మిగిలింది" అంటున్న చేతన్ ముఖంలోకి సూటిగా చూడలేక తలలు దించుకున్నా దోషులిద్దరూ. ■

## చల్లగాలి నానీలు

పం పొట్టి
భావం గట్టి
గుప్పెడు రాగాల్ని
గుమ్మరించు గుంభనంగా

కాలం వేయి రేకుల్లా
విప్పారే స్వప్నం
కలం కలకాలం
నిలిచే స్వర్గం

కూల్చడాలు
పేల్చడాలు
మనిషి చేతిలో వున్న
అణ్వాస్త్రాలు

వాడు-వీడు
నీది-నాది
తారతమ్యమెందుకు
అంతా ప్రకృతిదేగ

ఆత్మబలం
బుద్ధిబలం
మనిషిని కాచే
సంరక్షణ దళం!

ఉత్సాహ
కెరటమైతే
ఆశయం అడుగుల్లో
చిగురిస్తాది విజయం

లోకం పోకడ
'మని'షీ ఎత్తుగడ
రెండూ రెండే
జీవితంలో గడబిడ

కాలాన్నీ
బంతిని చేసి తంతే
అది మళ్ళా
నీ కాడి కొస్తుందా!?

కాలం
ఒక మయసభ
వింతలు విడ్డూరాలతో
అనునిత్యం శోభ

లక్ష్యసాధనలోన
లాభాలెన్నో
లక్ష్యం లేకుంటే
పూజ్యం గురో

పరలోకమా
నరలోకమా
మతాలన్నింటికీ
దురహంకారమే!

ప్రకృతంతా
హరితమై పల్లవిస్తే
చల్లగాలులు
తాకి హర్షించవూ!

-చల్లగాలి బాబూరావు